విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 06, మార్చి 2025

వైన్ షాపు ఎత్తేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-డోన్ : విద్యార్థులు చదువుకునే దగ్గర వైన్ షాపులు, మటన్ షాపులను ఎత్తేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డోన్ మండల సమితి ముఖ్యుల సమావేశం నక్కి రామన్న భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రతాప్ మాట్లాడుతూ డోన్ మండలంలో యు.కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుకునే ప్రదేశాల దగ్గర వైన్ షాపులను నిర్వహిస్తున్నారని, తాగి దారి వెంట పడిపోయిన వారిని చూసి విద్యార్థులు ఏం నేర్చుకుంటారన్నారు. నేటి విద్యార్థులే రేపటి తాగు బోతులు అనే విధంగా అధికారులు వైన్ షాపులు, యాజమాన్యం వ్యవహారం ఉందన్నారు.డోన్ పట్టణం లోని కొత్తపేట స్కూలు దగ్గర మటన్ షాపులు పెట్టు కొని, జంతువులను కోసి వాటి నుండి వచ్చే వ్యర్థపదా ర్థాలను అదే ప్రదేశం లోనే రోడ్డుమీద పారావేస్తు న్నారని,వాటిని అధికారులు చూసి చూడనట్లు వివరించడం సరికాదని వారు అన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక కిలోమీటర్ దూరం వరకు విద్యార్థులు చదువుకునే ప్రదేశంలో వైన్ షాపులు, మటన్ షాపులు పెట్టకూడదని నిబంధన ఉన్నప్పటికీ అలాంటివి ఏవి పట్టించుకో కుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారని,అధికారులు అడుగుతే మామూళ్లు ముట్టిస్తున్నారని ఆరోపించారు.విద్యార్థి జీవితం నాశనం అవుతుందని వారు ఆవేద వ్యక్తం చేశారు. కావున మున్సిపాలిటీ అధికారులు, ఎక్సైంజ్, పోలీస్ అధికారులు వీటి పైన స్పందించి వైన్ షాపులను, మటన్ షాపులను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డోన్ మండల అధ్యక్ష కార్యదర్శులు శశిధర్ రెడ్డి , మనోజ్, మండల ఉపాధ్యక్షులు ప్రవీణ్, మహేష్, విష్ణు, మల్లీ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర హామీ అమలు చేయాలి

విశాలాంధ్ర - రుద్రవరం : వ్యవసాయ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల హామీ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న,సహాయ కార్యదర్శి భాస్కర్ లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో అరకొర నిధులను కేటాయించడం రైతులను అవమానిం చడమేనని అన్నారు. జిల్లాలోని తెలుగుగంగ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, అలగనూరు గోరుకల్లు,అవుకు ప్రాజెక్టులలో నిలిచిపోయిన పనులను యుద్ధ పాతిపదికన పూర్తి చేయాల న్నారు. రాష్ట్రంలో రైతులు దాదాపుగా 200 రకాలకు చెందిన పంటలను సాగు చేస్తున్నప్పటికీ కేవలం 20నుంచి 25రకాల పంటలకే ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటిస్తున్నా యి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటు న్నామని గొప్ప లు చెప్పుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల పేరు చెప్పి అధికారాలు చేపట్టి పబ్బం గడుపుకొని రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఏపీ అంటే అమరావతి పోలవరమే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి రైతు సమస్యల పైన, పెడింగ్ ప్రాజెక్టుల పైన కూడా దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రభుత్వం రైతు సమస్యల పైన రైతాంగం పైన దృష్టి సారించకపోతే ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను శ్రీ గురు రాజా విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షవలిరెడ్డి ప్రారంభించారు. వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగినులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల కొరకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని,పోటీలలో గెలుపొందిన వారికి జిల్లా సంఘం కార్యాలయంలో మార్చి 8న మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా పోటీల లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, అదే రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో అంతర్జాతీయ మహిళా దినోత్సం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, జిల్లా సహ అధ్యక్షులు శ్రీహరి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిలా ఉపాధ్యక్షులు ఫక్రుద్దిన్, విజయలక్ష్మి,సిటీ అధ్యక్షులు సత్యం, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రూ.37 వేల కోట్లకు

వినతులోచ్చాయి

విశాలాంధ - బనగానపల్లె : రోడ్లకు సంబంధించి ఆయా నియోజవర్గాల ఎమ్మెల్యేల నుంచి మంత్రుల నుంచి రూ.37 వేల కోట్ల వినతులు వచ్చాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బనగానపల్లె రాష్ట్ర రోడ్లు భవనాల,పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ మాకు బడ్జెట్ లో వీలున్న మేరకు రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోని రోడ్లకు మరమ్మతులు నూతన రోడ్ల నిర్మాణం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వీలైనంత వరకు అందరికీ సమ న్యాయం చేసేలా రోడ్లను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామన్నారు.

200 రోజులు పని కల్పించి, వలసలు నివారించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో 200రోజుల ఉపాధి హామీ పని దినాలు కల్పించి జిల్లాలో వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నంద్యాల డిఆర్వో రామునాయక్‌కు జిల్లా సమితి తరపున వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.నారాయణ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జిలానిభాష, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ హామీ ఉపాధి హామీ పథకం పనులలో రాజకీయ జోక్యం ఎక్కువైనందువల్ల వ్యవసాయ కార్మికులకు పనులు దొరక్క ఆకలి దప్పులతో పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసలువెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా డోన్ ప్యాపిలి,నందికొట్కూరు, ఆత్మకూరు నియో జకవర్గాలలోని పలుమండల, గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు లేకపోవడంతో గుంటూరు లాంటి ప్రాంతాలకు బతుకు జీవనం కోసం పిల్ల, పాపలతో సహా వలసలకు వెళ్లడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు వలసలు నివారించే ప్రయత్నం చేసి వారికి ఉపాధి కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసి వారికి రోజు వేతనం 700 రూపాయలు మంజూరు చేయడం వల్ల వలసలు ఆగుతాయన్నారు. జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్ బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - చాగలమర్రి : కడప జిల్లా కానగూడురుకు చెందిన అమీర్‌భాష (45)పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన చాగలమర్రి పట్టణంలోని రిక్వెస్ట్ స్టేజ్ సమీపంలో జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు కానగూడురుకు చెందిన అమీర్‌భాష మద్యానికి బానిసై గతకొద్దికాలంగా అతిగా మద్యం సేవించే వాడు. అదే క్రమంలో మంగళవారం అతిగా మద్యం సేవించి అదే మత్తులో క్రిమిసంహారక మందు సేవించి చాగలమర్రి పట్టణంలోని రిక్వెస్ట్ స్టేజ్ సమీపంలోని ఓ హోటల్‌లో పడిపోయి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామ నిమిత్తం మృతదేహాన్ని ఆళ్ళగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు వివరించారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర-అవుకు : ఈనెల 17వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి పరీక్షా కేంద్రాలను డోన్ డిప్యూటీ డిఈఓ ఎస్ వెంకట్రాంరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల కోసం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 240 మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 240 మంది విద్యార్థులు, సెయింట్ మేరీస్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 130 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయునన్నారని అన్నారు. ప్రతి విద్యార్థి బెంచిపై కూర్చుని పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు శ్రీధర్ రావు, వెంకటేశ్వర రెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింగయ్య, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు : ప్రిన్సిపల్

విశాలాంధ్ర - శిరివెళ్ల : విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టు లో నైపుణ్యాభివృద్ధి సాధి.స్తే ఉద్యోగ ఉపాధి అవకా శాలు పుష్కలంగా ఉంటా యని జిటిఎంఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఇంద్రావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో గల జీటీఎమ్ఆర్ కళాశాలలో అకౌంట్ అండ్ ఎగ్జిక్యూటివ్ అనే నూతన నైపుణ్యాభివృద్ధి కోర్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చుని స్కిల్ డెవలప్మెంట్ కోసం పట్టణాలకు వెళ్లకుండా గ్రామీణ ప్రాంతంలోనే నైపుణ్య అభివృద్ధి కోర్సులు లభించాలన్న సదుద్దేశంతో స్థానిక డిగ్రీ కళాశాలలోనే ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డాక్టర్ జనార్ధనుడు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని స్కిల్ హబ్ కన్వీనర్ మాధవ విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం ఫండ్స్‌ను త్వరగా పూర్తి చేయాలి : ఏపీ రేష్మ

విశాలాంధ్ర - బనగానపల్లె : ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ఫారం ఫండ్స్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసినందుకు ఉపాధి హామీ సిబ్బంది కృషిచేయాలని మండల ఏపీఓ రేష్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎన్ ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 5 ఎకరాల్లోపు ఉండే రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పథకంపై ప్రతినెల రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రివ్యూ నిర్వహిస్తున్నారని జూన్ 30 లోపల 150 ఫారం ఫండ్స్ నిర్మాణాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి ఎల్ ఆర్ సి కోర్స్ డైరెక్టర్ పరమేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ మక్బూల్ హుస్సేన్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ ఆయకట్టుకు..

నీటిని విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కేసీ కెనాల్ ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నంద్యాల కె.సి.కెనాల్ కార్యాలయం ఎదుట రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కె.సి.కెనాల్ ఆయకట్టు రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. కేసీ కెనాల్ ఆయకట్టులో సుమారు 70వేల ఎకరాలు రబీ పంట కొనసాగుతోందని, ఈ పంటలకు ఏప్రిల్ 30వ తేదీ వరకు నీరు అందించాల్సిన అవసరం ఉందని, కానీ అర్ధాంతరంగా కేసి కాలువలో నీటి విడుదలను ప్రభుత్వం నిలుపుదల చేయడం వలన పంటలు ఎండిపోవడం, రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం సుమారుగా 120 రోజులు కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహించి 1562 టిఎంసీల నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా చేరినప్పటికీ అర్ధాంతరంగా నీటి విడుదలను ఎందుకు ఆపారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం బోటాబొటిగా వర్షాలు కురిసినా శ్రీశైలం రిజర్వాయర్ కు చాలా తక్కువ నీరు చేరినప్పటికీ రబీ పంటలు పూర్తి అయ్యేంత వరకు నీటిని అందించిన విషయాన్ని రైతులు గుర్తు చేసారు. ఈ ధర్నాలో బెక్కం చిన్న రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కె.సి.కెనాల్ ఆయకట్టు పరిధిలో వివిధ మండలాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పంటలను కాపాడుతాం

జల వనరులశాఖ మంత్రి నిమ్మల, ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్‌తో మంత్రి ఫరూక్ భేటీ

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్, కార్యదర్శి రామసుందర్ రెడ్డి, ఈఎన్ సి వెంకటేశ్వర రావులకు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వివరించారు.

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు-కడప కెనాల్ ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడతామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రబీ సీజన్ లో వివిధ రకాల పంటలను రైతుల సాగు చేశారు. ఈ పంటలన్నీ ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. అయితే కేసీ కెనాల్‌కు సాగునీటి విడుదలను అధికార యంత్రాంగం నిలిపివేసింది. దీంతో పంటలు సాగు చేసిన రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న విషయాన్ని రాష్ట్ర బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రైతుల పరిస్థితిని సమగ్రంగా మంత్రి ఫరూక్ వివరించారు. ఈ విషయంపై మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ లు ఉమ్మడి కర్నూలు జిల్లా జలవనరులశాఖ అధికారులు, కేసీ ఆయకట్టులో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడారు. కేసీ కింద ఆయకట్టులో పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేసీ కెనాల్ ఆయకట్టులో సాగు చేసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,పంటలను కాపాడేందుకు అన్నిచర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రిఫరూక్ వెల్లడించారు.

వైభవంగా ధ్వజారోహణం

దిగువలో ఉత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజైన బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం కడ రమణీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువజామునే ధ్వజస్తంభానికి గరుత్మంతుని చిత్ర పటాన్ని ఎగురవేసి ఉత్సవాలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన జ్వాల నరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం భేరి పూజ నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీ జ్వాల నరసింహ స్వామి కొలువుదీరి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో : దిగువ అహోబిలంలో బుధవారం సాయంత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధాన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విశ్వక్సేనుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఉన్న మండపం వద్దకు విశ్వక్సేనుని ఊరేగింపుగా తీసుకొని వచ్చి మండపంలో ఆసీనులను చేశారు. అనంతరం అర్చకులు ఎదురుగా ఉన్న విశ్వక్సేనుని కొలిచి హారతి అందజేశారు.ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మహాసంకల్పం,శుద్ధ పుణ్యాహవాచన కార్యక్రమాలను నిర్వహించారు.ప్రత్యేక పూజల అనంతరం మండపంలోని మట్టిని సేకరించి ఆలయ అర్చకులు వేదపండితులు పాలికలతో నవధాన్యములు కలిపి పూజలు నిర్వహించారు.

పశు సంపదను కాపాడేందుకే టీకాలు

విశాలాంధ్ర - చాగలమర్రి : పశు సంపదను కాపాడేందుకే గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని ఆళ్ళగడ్డ డివిజన్ పశు సంవర్ధశాఖ ఉపసంచాలకులు రమణయ్య తెలియజేసారు. బుధవారం మండలంలోని ముత్యాలపాడు తాండా గ్రామంలో జరుగుతున్న గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 4 నెలల వయస్సు పైబడిన అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు ఈ టీకాలు వేయడం జరుగుతుందన్నారు.ఆళ్ళగడ్డ డివిజన్ పరధిలోని 12 మండలాల్లో సుమారు లక్ష దాకా పశువులు ఉన్నాయన్నారు. మండలంలో సుమారు 10 వేల పశువులు ఉన్నాయని,వాటిలో ఇప్పటి వరకు రెండు వేల పశువులకు ఈ టీకాలు వేసామన్నారు.పాడి రైతులు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సాయిబాబా,పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - రుద్రవరం : సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఇన్చార్జి ఈఓపిఆర్డి సుబ్బారావు తెలిపారు. బుధవారం మండలంలోని నరసాపురం, ముత్తలూరు, ఆర్ నాగులవరం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్తలూరు సచివాలయంలో సి ఎల్ రిజిస్టర్లు సక్రమంగా రాయడం లేదన్నారు. అలాగే మూమెంట్ రిజిస్టర్లు సక్రమంగా లేవన్నారు. ఆర్ నాగులవరం గ్రామంలో రికార్డుల నిర్వహణ కూడా సరిగా లేదని 5మంది సచివాలయ సిబ్బంది పనితీరు బాగాలేదని విధులకు వారు సక్రమంగా హాజరు కావడం లేదని వారు తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించడం జరిగిందన్నారు.

కేసీ కెనాల్ ఆయకట్టుకు

విఘాతం కల్పించవద్దు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల ఆపవద్దని, నీటి విడుదల ఆపితే కేసి కెనాల్ ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతారని, కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎంపీ,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆమె కోరారు. కర్నూలు - కడప జిల్లాల పరిధిలో కేసీ కెనాల్ ఆయకట్టు క్రింద రైతులు రబి సీజన్ లో సుమారు 90000 వేల ఎకరాలు పంట సాగుచేశారని, ఈ రబీ పంటలకు ఏప్రిల్ 30వ తేదీ వరకు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కృష్ణానదిలో నీటి ప్రవాహం తగ్గుతుందన్న కారణంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసి కాలువలో నీటి విడుదలను ఆపాలనుకోవడం సరికాదని, రబీ సీజన్ పంట చివరి దశకు వచ్చిందని నీటి నిలుపుదల చేయడం వల్ల సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆమె వివరించారు. కేసి కెనాల్ ఆయకట్టు రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోతామని ని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

కేసీ కెనాల్‌కు నీరు విడుదల..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కేసీ కెనాల్ రైతులకు నీరు తెప్పిస్తామని రైతులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఇచ్చిన మాట ప్రకారం బుధవారం సుంకేసుల నుండి 1700 క్యూసెక్కులు అలాగే మల్యాల నుండి 650 క్యూసెక్కులు మొత్తం 2250 క్యూసెక్కుల నీటి నీ కేసీ కేనాల్ కు విడుదల చేయించారని ఎమ్మెల్యే కార్యాలయం వర్గాలు తెలిపాయి. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పర్సనల్ గా కేర్ తీసుకొని అధికారులతో మాట్లాడి బుధవారం కేసీ కెనాల్ కు నీరు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే దే అన్నారు. కెసి కెనాల్ కు నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకి ఎప్పటికీ రుణపడి ఉంటామని కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు తెలిపారు.

విజిలెన్స్ విద్యుత్ అధికారులు విస్తృత దాడులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాలలో నంద్యాల విజిలెన్స్ విద్యుత్ అధికారులు విద్యుత్ చౌర్యంపై విస్తృత దాడులు బుధవారం నిర్వహించారు. విద్యుత్ అధికారులు ఎడి కృష్ణమూర్తి, డిఈ గోపి, ఏఈలు రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డిలు మండలంలోని చింతలాయిపల్లి, అబ్దుల్లాపురం, మదనంతపురం గ్రామాలలో దాడులు నిర్వహించి అక్రమ విద్యుత్ దారులపై కేసులు నమోదు చేశారు. మూడు గ్రామాలలో 33 మంది అక్రమంగా విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసి రూ.88వేలు జరిమానా విధించారు. అక్రమంగా విద్యుత్ వాడితే చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ వినియోగదారులు అన్ని అనుమతులు తీసుకొని విద్యుత్ వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర - వెలుగోడు : ఎస్సైలుగా కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నందువల్ల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని వెలుగోడు ఎస్సై విష్ణు నారాయణ పేర్కొన్నారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన మద్దెల సతీషు, గుంతకందాల గ్రామానికి చెందిన నాగ కీర్తన కొత్తగా ఎస్సైలుగా ఎంపికయ్యారు. వీరిని వెలుగోడు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బుధవారం వెలుగోడు ఎస్సై విష్ణు నారాయణ ఘనంగా సన్మానించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, వారిని గౌరవంగా, మంచి తనం ప్రదర్శిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యాయులు, ఎస్సైలుగా ఉద్యోగాలు పొందిన వారి తల్లిదండ్రులు సంజీవ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఉపాధి పనుల అవినీతిపై మౌనమేంటి?



విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఉపాధి హామీ పనులలో భారీ మొత్తంలో అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా ఉన్నత స్థాయి అధికారుల మనం వెనుక దాగి ఉన్న అంతర్యం ఏమిటని పలువురు ఉపాధి కూలీలు విమర్శిస్తున్నారు. ఉపాధి హామీ పనులు వలస కూలీల నివారణ కోసం చేపడుతున్నారా, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్ల కోసమే ఉపాధి పనులు చేపడుతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఊరుని కాసుకుని పూట గడవడం కోసం ఉపాధి పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలు పూర్తిస్థాయిలో నష్టపోతున్న అవినీతిపరులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోకుండా మౌనం పాటించడం ఎంతవరకు సమంజసమో ఉన్నత స్థాయి అధికారులు ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఓ పక్కేమో తాను కొత్తగా వచ్చాను, తన మాట ఎవరు వినడం లేదని ఏపీవో పలువురితో గోడు వినిపించుకుంటున్నట్టు రహస్య సమాచారం. ఏదేమైనప్పటికీ ఉన్నత స్థాయి అధికారులు ఉపాధి పనులలో జరుగుతున్న అవినీతిపరుల వైపు ఉంటారా, వ్యవసాయ కూలీల వైపు ఉండి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటారా వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యా రాణి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యా రాణి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత, అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు,భద్రతా, రక్షణ, గౌరవం తెలియ చేస్తూ అన్ని శాఖల సమన్వయంతో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారతను చాటేలా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మహిళా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్డీఏ డీఆర్‌డీఏ, మెప్మా శాఖలు కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళా సంఘాల్లో విజయవంతంగా వ్యాపారాలు చేస్తున్న వారిని, పారిశ్రామిక వేత్తలు తదితరులను ఈ వేడుకలకు ఆహ్వానించాలన్నారు. ఆయా రంగాల్లో విజయాలు సాధించిన మహిళలను ఆహ్వానించి సన్మానం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద బ్యాంకు రుణాల మంజూరు, బ్యాంక్ లింకేజి, ఇతర ఆర్థిక సహాయాలు మహిళా లబ్ధిదారులకు మెగా చెక్‌లు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకాశం జిల్లాలో నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారని, ముఖ్యమంత్రి సందేశం, లైవ్ కార్యక్రమాన్ని వీక్షించేలా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, మెప్మా పీడీ నాగ శివలీల, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, ఎల్‌డీఎం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోసానికి 14 రోజుల రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, మంత్రి నారాలోకేషన్‌ను వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాక్యలు చేశారంటు ఆదోని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఆదోని పోలీసులు పోసాని మురళీ కృష్ణ గుంటూరు రిమాండ్ ఖైదీగా ఉండగా ఆదోని పోలీసులు తమకు అప్పగించాలని కోరడంతో మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించి, ఆయనకు అప్పగించారు. ఆదోని పోలీసులు పోసానిని కర్నూలు కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి ఈ నెల 18 వరకు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు ఆయనను కర్నూలు సబ్ జైలుకు తరలించారు. ఇతనిపై ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ విశ్వ విద్యాలయ అభివృద్ధికి అధిక నిధులు కేటా యించాలని యువ జన సంఘాల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఉన్నత విద్యమండలి చైర్మన్ మధు మూర్తిని కలిసిన రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యప్రకాష్‌లు మాట్లాడుతూ విశ్వవిద్యాలయములో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింప చేయా లన్నారు. వారికి జీతాలు పెంచాలని అన్నారు. ప్రభుత్వం రాయలసీమ విశ్వవిద్యాలయానికి అరకొర నిధులు కేటాయించడం వలన విశ్వ విద్యాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. విశ్వ విద్యాలయ పరిధిలో నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల పై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, విశ్వవిద్యాలయంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పెద్దదేవర మహోత్సవం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని ఆగవేళి గ్రామంలో పెద్ద దేవర మహోత్సవాన్ని ప్రజలు, భక్తులు ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెలసిన మారెమ్మ, సుంకులమ్మ, పెద్దమ్మ, రాములమ్మ దేవతలకు గత రెండు రోజుల నుండి పూజా కార్యక్రమాలు చేపడుతూ పోతులను గ్రామపురి వీధుల గుండా ఊరేగించి దేవతలకు బలిగా అర్పించారు. ప్రతి ఇంటి నుండి బోనాలతో నైవేద్యం సమర్పించి, పొట్టేళ్లను బలిగా అర్పించారు. దేవరకు భక్తులు, ప్రజలు తండోపతండాలుగా వచ్చి దేవతలకు పూజలు చేసి, మొక్కుబళ్ళు తీర్చుకున్నారు. గ్రామం అంతా ఎంతో సందడితో నెలకొని ప్రజలతో కిక్కిరిసిపోయింది. గ్రామ సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యములతో సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం పాడిపంటలతో అభివృద్ధి చెందాలని, గ్రామంలో వెలసిన దేవతలకు చల్లదనంగా పెద్ద దేవర కార్యక్రమాన్ని చేస్తారన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పెరుగు విజయ వర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : కృష్ణా, గుంటురు ఎమ్మెల్సీ పట్టబద్రుల ఎన్నికల ఫలితాలలో విజయభేరి మ్రోగించిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గీతాంజలి నర్సింగ్ కళాశాల, కిమ్స్ నర్సింగ్ కళాశాలల చైర్మెన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడ టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీకి ఏపీ నర్సింగ్ ఇన్స్టిట్యూట్స్ మేనేజ్మెంట్స్ తరుపున కర్నూలు గీతాంజలి నర్సింగ్ కళాశాల, కిమ్స్ నర్సింగ్ కళాశాలల చైర్మెన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి భోఖే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింగ్ కళా శాలలలోని కొన్ని సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా, భవిష్యత్తులో పరిష్కరానికి చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు విజయ్ వర్ధన్ రెడ్డి తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ఈ నెల 8న రెండో శనివారమున కర్నూలు, నంద్యాల జిల్లాలలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని, కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తాం : మాజీ ఎంపీ

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కర్నూలు నగరంలో క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. బుధవారం ఎస్టీ బీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బంగారుపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ క్రీడలతో శారీరిక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. బంగారు పేటకు చెందిన నీలి షికారులు నిర్వహిస్తున్న బీపీసీఎల్ పోటీలకు స్థానికులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి క్రీడాకారులు కర్నూలుకు వచ్చి ఆడడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఎవరితో సహకారం తీసుకోకుండా ఎంతో క్రమశిక్షణతో నాలుగు సంవత్సరాలుగా ఈ పోటీ నిర్వహిస్తుండడం చిన్న విషయం కాదన్నారు. మాజీ కార్పొరేటర్ విటల్ శెట్టి, బంగారు పేట ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్లు సురేష్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - కోడుమూరు: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈ నెల 7న శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా స్కిల్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ శేఖర్,ప్రిన్సిపల్ విజయ్ తెలిపారు. కోడుమూరు పట్టణ ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాబ్ మేళాలో ఫ్లిప్ కార్ట్, సెల్ ఫోన్ వస్తువుల తయారీ కంపెనీ, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు పాల్గొనుచున్నాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, ఎంకామ్ చదువుకున్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఉదయం 10 గంటలకు తమ విద్యార్హత జిరాక్స్ పత్రాలతో కళాశాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ జాబ్ మేళలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 8500783459 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ప్లేస్మెంట్ అధికారి సాయి తేజ,జిల్లా స్కిల్ అధికారి వై వీరేష్ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వేను వేగవంతంగా చేపట్టాలి

విశాలాంధ్ర - తుగ్గలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌సీడీ సర్వేను గ్రామస్థాయిలో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వేగవంతంగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలిపారు. బుధవారం తుగ్గలి, పగిడి రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఎన్‌సీడీ సర్వేను సకాలంలో వేగవంతంగా చేపట్టాలని ఆయన తెలిపారు. ఫార్మాసిస్టు రమేష్, స్టాఫ్ నర్స్ రామలక్ష్మి, డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది సయ్యద్ ఖలీల్ బాష పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఈ నెల 17వ తారీకు నుంచి 31 వరకు పదో తరగతి రెగ్యులర్, పరీక్ష తప్పిన విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామేల్ పాల్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా విద్యార్థులకు వాట్సాఫ్ మనమిత్ర ద్వారా ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల తమ వాట్సాప్ ద్వారా 9552300009కి హాయ్ అని సందేశాన్ని పంపాలని, తర్వాత చాయిస్ సర్వీస్ లేదా సేవను ఎంచుకోండి తర్వాత ఎడ్యుకేషన్ సర్వీస్ లేదా విద్యా సేవలపై క్లిక్ చేసి, ఎస్ఎస్‌సీ హాల్ టికెట్ ఎంచుకొని తర్వాత మీ అప్లికేషన్ నెంబరు అయ్యింది. పుట్టిన తేదీని నమోదు చేసి కన్ఫామ్ క్లిక్ చేసి మీ హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఈమెయిల్ ద్వారా తీసుకోవచ్చని వారు తెలిపారు.

328 విద్యార్థులు గైర్హాజరయ్యారు : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు రాయడానికి 20496 గాను పరీక్షలు రాసిన వారు 20147, పరీక్షకు హాజరుకాని వారు 328 మంది అని బుధవారం ఆర్ఐఓ గురవయ్య శెట్టి తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కింద ఏడు కేసులు నమోదు చేశామన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో 122 మంది గైర్హాజరు: జిల్లాలో ఓపెన్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు 1119 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 997 విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు 122 మంది గైర్హాజరు కాగా, 9 పరీక్ష కేంద్రాల గాను, కర్నూలులో 5 మంది సెట్టింగ్ స్క్వాడ్, డ్రాయింగ్ స్క్వాడ్లు, ఇద్దరు పరీక్ష కేంద్రాలను పరివేక్షించారని, ఒకరిని మాల్ ప్రాక్టీస్ కింద నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

9న కదిరప్ప కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని రోళ్లపాడు సమీపాన వెలసిన కదిరప్ప లక్ష్మినరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇక్కడ వెలసిన లక్ష్మి నరసింహ స్వామి భక్తుల కోరిన కోర్కెలు తీర్చే స్వామి అని అన్నారు. భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని పునీతులు కావాలని పిలుపునిచ్చారు. అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యాయవాదులు అంకితభావంతో పని చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: న్యాయవాద వృత్తిలోకి వచ్చే జూనియర్ న్యాయవాదులు అంకిత భావంతో పని చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగ స్వామి, సీనియర్ న్యాయ వాది సత్యనారాయణ సూచించారు. బుధవారం పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన జగ్గలి రంజిత్ కుమార్ అనే యువ న్యాయవాది పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్‌లో నూతన సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులు రెగ్యులర్‌గా కోర్టుకు హాజరై, కేసుల పట్ల విషయ పరిజ్ఞానం పెంపొందించుకొని కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున, నాగేష్, నరసింహయ్య, మహేష్, బాలబాష, మధుబాబు, భాస్కర్, రాజశేఖర్, వాసు, అరుణ్, జె.రవికుమార్ పాల్గొన్నారు.

వర్మి ఎరువు తయారీపై శిక్షణ

విశాలాంధ్ర - కోడుమూరు : చెత్త సంపద తయారీ కేంద్రంలో తడి చెత్త నుండి వర్మి ఎరువు తయారు చేయు విధానంపై సంబంధిత అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది.బుధవారం స్థానిక వెంకటగిరి రోడ్డులోని పట్టణ శివారులో ఉన్న చెత్త సంపద కేంద్రంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భాగ్యరత్న,ఈవో అజయ్ భాస్కర్ ల ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, క్రిష్ణగిరి మండలాల విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎల్పిఓ లక్ష్మి, డిపిఆర్సి ఆర్పి పద్మావతిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల క్లాప్ మిత్రాలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

విశాలాంధ్ర -దేవనకొండ: రైతాంగానికి మండల గిట్టుబాటు ధరల హామీ చట్టాన్ని అమలు చేయాలని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్ర, రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు వై.కందప్ప, సీపీఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన దేవనకొండ నందు ఏఐకెఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు దాదాపుగా 200 రకాల పంటలకు పైగా పండిస్తున్న కేవలం 20 నుంచి 25 రకాల పంటలకే మద్దతు ధర ప్రకటిస్తున్నాయన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అమలు చేయడం లేదన్నారు. ఏ గ్రేడ్ మిర్చి ధర ప్రస్తుతం రూ.17 వేలుగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.11700 ఇస్తున్నామని చెప్పుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల పేరు చెప్పి అధికారాలు చేపట్టి పబ్బం గడుపుకొని రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, నకిలీ విత్తనాలు,పురుగు మందులను అరికట్టి రైతుకు ప్రోత్సాహకం అందించకపోతే రైతు మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతు సమస్యలపై, రైతాంగంపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే జిల్లా వ్యాప్తంగా రైతు చైతన్య యాత్రలు నిర్వహించి, రైతులను చైతన్య పరచి రైతు ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం నాయకులు కృష్ణ, రవికుమార్, అనుమప్ప, కోదండ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంజహాల్లి శ్రీశ్రీశ్రీ సద్గురు మహాత్మ బడేసాహెబ్ ఉరుసు మహోత్సవం

విశాలాంధ్ర -గోనెగండ్ల: నేడు గంజిహాల్లి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సద్గురు మహాత్మా బడేసాహెబ్ వారి 327వ ఉరుసు మహోత్సవం బుధవారం రాత్రి దర్గా ధర్మకర్త కుబేర్ రెడ్డి, దర్గా పీఠాధిపతులు సయ్యద్ చిన్న ముద్గోల్, పూల బాష, దర్గా డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు, దర్గా పూజారులు, ధర్మకర్త కుబేర్ రెడ్డి ఇంటి నుంచి బడేసాహెబ్ తాత దర్గా వరకు గంధంతో బయలు దేరారు. నేడు గంజహాల్లి గ్రామంలో మతసామరస్యానికి ప్రతీక బడేసాహెబ్ ఉరుసు మహోత్సవం జరుగు తుంది. వివిధ ప్రాంతం నాయకులు, ప్రజాప్రతిని ధులు, అధికారులు, బడే సాహెబ్ దర్శనం కోసం పాల్గొంటారు.

అన్ని ఏర్పాట్లు సిద్ధం - సయ్యద్ చిన్న ముద్గోల్: దర్గా డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, గ్రామంలో ఆరోగ్య శిబిరాల ఏర్పాటు లాంటి సేవా కార్య క్రమాలే కాకుండా నేడు ప్రారంభమయ్యే ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎలక్ట్రికల్ ఇంజనీర్ సయ్యద్ చిన్న ముద్గోల్ తెలిపారు. ప్రజలకు రవాణా ఇబ్బంది లేకుండా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి 20కి పైగా బస్సులు, 15 ట్యాంకర్లతో నీటి వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాల వైద్య సిబ్బంది సహకారంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో విద్యుత్తు సమస్య లేకుండా ఆర్డీఎస్ఎస్ స్కీం కింద గంజహాల్లి గ్రామంలో 24 గంటలు విద్యుత్తు ఉండే విధంగా జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం ఉమాపతి సహకారంతో ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన ఎస్ఈకి గ్రామస్తులు, భక్తాదులు దర్గా ధర్మకర్త, పీఠాధి పతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

భూమి సాగులో ఉన్న వారికే సొంతం : ఆర్డీవో

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: ఎవరైతే భూమి సాగులో ఉన్నారో వారికి భూమి అసైన్ చేస్తామని పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాదాపురం గ్రామ పొలిమేరలో ఉన్న దళితుల భూములను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టేందుకు వచ్చానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద దళితులకు ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ ద్వారా సర్వేనెంబర్ 759/ఏ1, 700/1 విస్తీర్ణం గల 43 ఎకరాల భూమిని 13 మంది దళితులకు పట్టాలు మంజూరు చేసిందన్నారు. భూమి సాగులో ఉన్న 13 మంది దళితుల పేర్లను తొలగించి, వన్ బీ అడంగల్‌లో వేరే పేర్లు నమోదు చేశారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిమిత్తమై క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. విచారించిన నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఎవరైతే భూమి సాగులో ఉన్నారో అలాంటి వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ దేవ చంద్రశేఖర్, వీఆర్వో శ్రీధర్, అనీల్, సర్వేర్ సాగులో ఉన్న దళితులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శాశ్వత బదిలీ చట్టంలో మార్పులు చేయాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర-పత్తికొండ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ శాశ్వత బదిలీ చట్టం 2025లో కొన్ని మార్పులు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్స్ కొత్తపల్లి సత్య నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం మండల అధ్య క్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ బది లీల ప్రక్రియలో అన్యాయం జరిగితే న్యాయ పోరా టానికి ప్రభుత్వంచే నియమించబడ్డ ప్రత్యేక అధికారి రాతపూర్వక అభ్యంతరం మాత్రమే కోర్టు పరిగణలోకి తీసుకునే విధంగా చేర్చడం జరిగింద న్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల జిల్లా స్థాయి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలన్నారు. అవివా హిత మహిళలకు వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రత్యేక పాయింట్లు ఇవ్వాలన్నారు. బదిలీలు పాఠశాల నుండి పాఠశాలకు కాకుండా ఆవాస ప్రాంతం నుండి ఆవాస ప్రాంతంకు తీసుకోవాలని సూచిం చారు. సాధారణ బదిలీ సమయంలో తప్ప ఉపా ధ్యాయ బదిలీలను చేపట్టరాదన్నారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు నారా యణ, చంద్ర శేఖర రెడ్డి, చెన్న కేశవరావు, బీరప్ప, వెంకటరాముడు, రాఘవేంద్ర, కృష్ణమూర్తి, ఇక్బాల్ హుస్సేన్, సూరి, ప్రసాద్, పత్తికొండ, తుగ్గలి మండల కార్య దర్శులు బలరాముడు, సంజీవయ్య, నాయకులు మారుతి, మండ్ల వెంకటేశ్వర్లు, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

ఒరిజనల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పోయినవి

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల రాముడు S/o జి.నారాయణకు చెందిన ఒరిజనల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ 02-03-2025వ తేదీన పోయినవి. కర్నూలులోని వన్‌టౌన్ ఏరియా నందలి మా బంధువుల యొక్క ఇంటికి పోయి, తిరుగు ప్రయాణంలో ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినవి. కర్నూలు జిల్లా కర్నూలు మండలం నందనపల్లె గ్రామానికి చెందిన సర్వే నెం. 292లోని 2.33 ఎకరాల (గుంతల చేను) నందలి 2.75 సెంట్ల భూమి ఇండ్ల ప్లాట్లకు చెందిన ఒరిజనల్ డాక్యుమెంట్ నెం.13522, తేది:28-11-2018వ తేదీకి చెందిన డాక్యుమెంట్‌లు పోయినవి. కావున ఎవరికైన దొరికినచో ఈ క్రింది 9491880581 సెల్ నెంబరుకు సమాచారం ఇవ్వగలరు. తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
జి.రాముడు S/o జి.నారాయణ
ఎర్రదొడ్డి గ్రామము & పోస్టు,
కోడుమూరు మండలం,
కర్నూలు జిల్లా.

మంచినీటి సమస్య పరిస్కారానికి తోడ్పడాలి

విశాలాంధ్ర - తుగ్గలి: మండలంలోని అన్ని గ్రామాలలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మంచినీటి సమస్య పరిస్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ అద్దంకి ఎర్ర నాగప్ప అధికారులకు తెలిపారు. బుధవారం మండల పరిషత్తు సమావేశ భవనంలో ఎంపీపీ అద్దంకి ఎర్ర నాగప్ప అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తమ గ్రామాలలో ఉండే మంచినీటి సమస్యను పరిష్కరించాలని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. వైద్య అధికారిణి డాక్టర్ హరిత మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తగు సూచనలు పాటించాలని ఆమె తెలిపారు. అనంతరం వివిధ శాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించిన విషయాలను సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ అద్దంకి ఎర్ర నాగప్ప మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న పనులలో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములుగా చేయాలని తెలిపారు. అంతేకాక ప్రస్తు త వేసవిలో గ్రామాల్లో ఎలాంటి మంచినీటి సమస్య ఏర్పడకుండా అధికారులు, సర్పంచులు సంయుక్తంగా కలిసి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులికొండ నాయక్, వైస్ ఎంపీపీ మల్లికార్జున్ రెడ్డి, ఎంపీడీవో విశ్వమోహన్, యూహోఆర్డీ శ్రీహరి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 06, మార్చి 2025

బండలాగుడు పోటీల విజేత జొన్నగిరి మస్తాన్ కాడెద్దులు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండలంలోని బాపురం గ్రామంలో శ్రీ గంగాదేవి రథోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బండలాగుడు పోటీలను పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ బండలాగుడు పోటీలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మొత్తం 14 జతల కాడెద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన అద్దాల మస్తాన్ యాదవ్ కాడెద్దులు నిర్ణీత 20 నిమిషాల్లో 6,919 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నందవరం గ్రామానికి చెందిన జిమికిల మహేష్ కాడెద్దులు నిర్ణీత సమయంలో 6,286 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలువగా, ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు గ్రామానికి చెందిన ఆకుల మంగయ్య కాడెద్దులు 6000 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. మంత్రాలయం మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన హనుమంతు కాడెద్దులు 5,569 అడుగులు లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన కాడెద్దుల యజమానులు జొన్నగిరి అద్దాల మస్తాన్ యాదవ్ కు రూ. 27,016, నందవరం జిమికిల మహేష్ కు రూ. 21,016, గుడేకల్లు ఆకుల మహేష్ రూ. 16, 016, చౌటుపల్లి హనుమంతుకు రూ. 10, 016 పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ చేతుల మీదుగా అందజేశారు. శ్రీ గంగాదేవి ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు హనుమంతరెడ్డి, సీపీఎం హనుమంతు, బసిరెడ్డి, నర్సిరెడ్డిగారి హనుమంతరెడ్డి, టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, ఏక హనుమంతు, నరసప్ప, చంద్ర, నారాయణ, ఈరన్న, నరసింహులు, సొసైటీ సీఈఓ నరసింహమూర్తి, వైసీపీ నాయకులు కేపీ యల్లప్ప, బ్రహ్మయ్య, చిన్న వీరేష్, కడబూరి, లక్ష్మన్న, మహదేవ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

దిగువలో ఉత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం



విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజైన బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం కడ రమణీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువజామునే ధ్వజస్తంభానికి గరుత్మంతుని చిత్రపటాన్ని ఎగురవేసి ఉత్సవాలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవమూర్తులైన జ్వాల నరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం భేరి పూజ నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీ జ్వాల నరసింహ స్వామి కొలువుదీరి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో : దిగువ అహోబిలంలో బుధవారం సాయంత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధాన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విశ్వక్సేనుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఉన్న మండపం వద్దకు విశ్వక్సేనుని ఊరేగింపుగా తీసుకొని వచ్చి మండపంలో ఆసీనులను చేశారు. అనంతరం అర్చకులు ఎదురుగా ఉన్న విశ్వక్సేనుని కొలిచి హారతి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మహాసంకల్పం,శుద్ధ పుణ్యాహవాచన కార్యక్రమాలను నిర్వహించారు.ప్రత్యేక పూజల అనంతరం మండపంలోని మట్టిని సేకరించి ఆలయ అర్చకులు వేదపండితులు పాలికలతో నవధాన్యములు కలిపి పూజలు నిర్వహించారు.

పోసానికి 14 రోజుల రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, మంత్రి నారాలోకేషన్‌ను వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటు ఆదోని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఆదోని పోలీసులు పోసాని మురళీ కృష్ణ గుంటూరు రిమాండ్ ఖైదీగా ఉండగా ఆదోని పోలీసులు తమకు అప్పగించాలని కోరడంతో మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించి, ఆయనకు అప్పగించారు. ఆదోని పోలీసులు పోసానిని కర్నూలు కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి ఈ నెల 18 వరకు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు ఆయనను కర్నూలు సబ్ జైలుకు తరలించారు. ఇతనిపై ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ విశ్వ విద్యాలయ అభివృద్ధికి అధిక నిధులు కేటా యించాలని యువ జన సంఘాల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఉన్నత విద్యమండలి చైర్మన్ మధు మూర్తిని కలిసిన రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యప్రకాష్‌లు మాట్లాడుతూ విశ్వవిద్యాలయములో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింప చేయా లన్నారు. వారికి జీతాలు పెంచాలని అన్నారు. ప్రభుత్వం రాయలసీమ విశ్వవిద్యాలయానికి అరకొర నిధులు కేటాయించడం వలన విశ్వ విద్యాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. విశ్వ విద్యాలయ పరిధిలో నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల పై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, విశ్వవిద్యాలయంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పెద్దదేవర మహోత్సవం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని ఆగవేలి గ్రామంలో పెద్ద దేవర మహోత్సవాన్ని ప్రజలు, భక్తులు ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెలసిన మారెమ్మ, సుంకులమ్మ, పెద్దమ్మ, రాములమ్మ దేవతలకు గత రెండు రోజుల నుండి పూజా కార్యక్రమాలు చేపడుతూ పోతులను గ్రామపురి వీధుల గుండా ఊరేగించి దేవతలకు బలిగా అర్పించారు. ప్రతి ఇంటి నుండి బోనాలతో నైవేద్యం సమర్పించి, పొట్టేళ్లను బలిగా అర్పించారు. దేవరకు భక్తులు, ప్రజలు తండోపతండాలుగా వచ్చి దేవతలకు పూజలు చేసి, మొక్కుబళ్ళు తీర్చుకున్నారు. గ్రామం అంతా ఎంతో సందడితో నెలకొని ప్రజలతో కిక్కిరిసిపోయింది. గ్రామ సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యములతో సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం పాడిపంటలతో అభివృద్ధి చెందాలని, గ్రామంలో వెలసిన దేవతలకు చల్లదనంగా పెద్ద దేవర కార్యక్రమాన్ని చేస్తారన్నారు.

యాగంటి క్షేత్రంలో జిల్లా సంయుక్త కలెక్టర్

విశాలాంధ్ర - బనగానపల్లె : జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.విష్ణు చరణ్ దంప తులు మండల పరిధిలోని యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. ఈవో బి చంద్రుడు , యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తీర్థ ప్రసాదాలు అందజేశారు. తహసీల్దార్ బి.నారాయణ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది రమేష్, అర్చకులు లోకనాథ్ శర్మ, మహేంద్ర శర్మ, చిరంజీవి శర్మ, రాఘవేంద్ర శర్మ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ..

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని ప్రాధమిక వ్యవసాయ సహకార సొసైటి కార్యాలయాన్ని జిల్లా సహకార అధికారి వెంకట సుబ్బయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. కొత్తగా సొసైటీలలో ఆన్లైన్ కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. జిల్లాలో 56 సొసైటీలు ఉన్నాయని అందులో 6 సొసైటీలలో ఆన్లైన్ పూర్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రమణమ్మ సీఈవో హుస్సేన్ మియా, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ తల్లి బాధ్యత : సీడీపీవో

విశాలాంధ్ర - బనగానపల్లె : ఈసీసీ ఈ దినోత్సవం సందర్భంగా పిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదని బనగానపల్లె శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని అంగన్‌వాడీ ఆరవ సెంటర్లో గర్భవతులు బాలింతలకు ఈసీసీఈ థీమ్ సంఖ్య సృజనాత్మకత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులు, బాలింతలను ఉద్దేశించి సిడిపిఓ ఉమామహేశ్వరి, సూపర్వైజర్ చిట్టెమ్మ, వారు మాట్లాడుతూ తక్కువ బరువు ఉండటం వల్ల పిల్లలు అనారోగ్యం గురవుతారని, పిల్లలు తక్కువ బరువు ఉండకుండా చూసుకునే బాధ్యత ప్రతి తల్లిది అన్నారు. గర్భవతులు ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణమైన, ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రమాదేవి, ఆయా చిన్నమ్మ ఏఎన్ఎం గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

విశాలాంధ్ర - ప్యాపిలి : పట్టణ సమీపంలోని అరుణాచల ట్రాన్స్పోర్ట్‌లో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆలయంలో ఈడి గణేశం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేద పండితులు శేషాద్రి చార్యులు, భాస్కర స్వామి వారిచే వేదమంత్రాల సాక్షిగా సీతారాముల ఉత్సవ మూర్తులకు కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరుణాచలం ట్రాన్స్ పోర్ట్ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం.ఆంతోనప్ప, హెచ్ఆర్ రవి కిరణ్, పిఆర్ ఓ.వినయ్, సిబ్బంది దివాకర్ బాబు, జయశంకర్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జరుగుతున్న దాడులను ఎందుకు ఆపలేక పోతున్నారు..

విశాలాంధ్ర - పాములపాడు : బిజెపి ప్రభుత్వానికి ఎస్సీ వర్గీకరణపై ఉన్న అత్యుత్సాహం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆపడంలో లేదని ప్రజా సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రమైన పాములపాడులోని సేవా భారతి కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాల నాయకులైన మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న, బీసీ సంఘం మండల అధ్యక్షుడు జి.సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు మురహరి రాజన్న, వైసీపీ మండల నాయకుడు శెట్టి శివలింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, మండల కోఆప్షన్ నెంబర్ సయ్యద్.ముర్తుజాఅలీ పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పట్ల అత్యుత్సాహాన్ని ప్రదర్శించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దళితులపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరిగే దాడులను ఎందుకు ఆపలేక పోతుందని, వారి హక్కుల పట్ల ఎందుకు ఆసక్తి కనపరచడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వము వచ్చిన 12 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమి పాలిత రాష్ట్రాలలో దళితులపై జరిగే హత్యలు, దాడులు, అత్యాచారాలు పట్ల దేశ ప్రధానికి, చీమ కుట్టినట్లు కూడాలేదన్నారు. దేశవ్యాప్తంగా బహుజనులకు రక్షణ లేకుండా పోతుంది అన్నారు. ఈ నేరాల నియంత్రనకు ఎలాంటి చర్యలు లేవని,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు, మరియు పేదలకు ఎటువంటి రక్షణ కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు దేశంలో జరిగిన సంఘటలను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్ట్‌ను అమలు చేశాయాన్నారు. ఇప్పుడు వున్నా బిజెపి ప్రభుత్వం ఈ యాక్ట్ లను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. దేశ ప్రజలు వీటన్నిటిని గమనిస్తున్నారన్నారు. అన్నింటికీ సమాధానం కాలమే నిర్ణయిస్తుందని, పరిష్కారం దొరికే రోజు తప్పక వస్తుందన్నారు.కనుక కేంద్ర,రాష్ట్ర శాఖలలో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న బహుజనులందరూ నరేంద్ర మోడీ చెప్పు చేతులలో బానిస బతుకులు బతకకుండా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడాలని పిలుపునిచ్చారు. దేశంలోని పౌరులందరూ ఒకసారి ఆలోచించుకొని రాబోయే రోజుల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు పాములపాడు మండల అధ్యక్షుడు మేకల జాన్ బాబు, ప్రజా సంఘాల నాయకులు రామ లింగరాజు, దయానందం, కలపండి సుధాకర్, ప్రసాద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కే ఫైజీ అరెస్టును ఖండిస్తూ నిరసన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఇటీవల ఢిల్లీలో ఎస్డీపీఐ జాతీయ అధ్యక్షులు ఎన్‌కే ఫైజిని అకారణంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పోలీసులు అరెస్టు చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నంద్యాల గాంధీ చౌక్ వద్ద ఎస్డీపీఐ నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్డీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు హాఫీస్ అతావుల్లాఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాస్వామ్య, విపక్షాల గొంతును నొక్కివేయడానికి ప్రయత్నిస్తున్నదని, ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను ఎస్ డిపిఐ తగిన విధంగా ఎదిరిస్తుందని తెలిపారు. న్యాయపరమైన పోరాటం ద్వారా ఎన్.కే ఫైజి విముక్తి కోసం కృషి చేస్తామని, ఈ వ్యవహారంలో సత్యం నిగ్గుతేలే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు ఎజాస్ హుస్సేన్, ఉపాధ్యక్షులు మజీద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి కరిముల్లా, నూరుల్లాతో పాటు ఎస్డీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగోడులో నిరసన.. ఢిల్లీలో ఎస్డీపీఐ జాతీయ అధ్యక్షులు ఎంకే ఫైజీని అకారణంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పోలీసులు అరెస్టు చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, వెలుగోడు మదీనా మస్జిద్ వద్ద ఎస్డిపిఐ నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. తక్షణము బేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్డీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ శ్రేణుల సంబరాలు

విశాలాంధ్ర - చాగలమర్రి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదే శ్రీనివాస నాయుడు విజయం సాధించడంతో పిఆర్‌టియు ఉపాధ్యాయులు బుధవారం సంబరాలు చేసుకు న్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్ర సంఘాల సహకారంతో ఈ గెలుపు సాధ్యమైంది అన్నారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని తక్షణమే ఐఆర్ 30శాతం ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మౌలాలి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయ రెడ్డి, జిల్లా నాయకులు ఓబుళపతి, హరినాథ్ రెడ్డి, సుబ్బరాయుడు, రవి ప్రకాశ్ రెడ్డి, దాదా పీర్, నబి సాహెబ్, రవిశంకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,దస్తగిరి లక్ష్మయ్య, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వందమంది విద్యార్థులకు ఖర్జూర పంపిణీ

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక గౌతమ్ స్కూల్ నందు పవిత్ర రంజాన్ నెలలో ఉపవాసం ఉన్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇఫ్తార్ విందులో భాగంగా ఖర్జూర పంపిణీ చేసిన పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయి ప్రణీత్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటూ, ఆ అల్లాను ప్రార్థించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పుల్లారెడ్డి హెడ్మాస్టర్ చాంద్ బాషా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పెరుగు విజయ వర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ పట్టబద్రుల ఎన్నికల ఫలితాలలో విజయభేరి మ్రోగించిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గీతాంజలి నర్సింగ్ కళాశాల, కిమ్స్ నర్సింగ్ కళాశాలల చైర్మెన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడ టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీకి ఏపీ నర్సింగ్ ఇన్స్టిట్యూట్స్ మేనేజ్మెంట్స్ తరుపున కర్నూలు గీతాంజలి నర్సింగ్ కళాశాల, కిమ్స్ నర్సింగ్ కళాశాలల చైర్మెన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి భోఖే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింగ్ కళా శాలలలోని కొన్ని సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా, భవిష్యత్తులో పరిష్కరానికి చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు విజయ్ వర్ధన్ రెడ్డి తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ఈ నెల 8న రెండో శనివారమున కర్నూలు, నంద్యాల జిల్లాలలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని, కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తాం : మాజీ ఎంపీ

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: కర్నూలు నగరంలో క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. బుధవారం ఎస్టీ బీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బంగారుపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ క్రీడలతో శారీరిక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. బంగారు పేటకు చెందిన నీలి షికారులు నిర్వహిస్తున్న బీపీసీఎల్ పోటీలకు స్థానికులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి క్రీడాకారులు కర్నూలుకు వచ్చి ఆడడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఎవరితో సహకారం తీసుకోకుండా ఎంతో క్రమశిక్షణతో నాలుగు సంవత్సరాలుగా ఈ పోటీ నిర్వహిస్తుండడం చిన్న విషయం కాదన్నారు. మాజీ కార్పొరేటర్ విటల్ శెట్టి, బంగారు పేట ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్లు సురేష్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో తెగులు నివారణ



విశాలాంధ్ర - పాములపాడు: పంట మార్పిడితో తెగుళ్లను నివారించుకోవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి హేమలత తెలిపారు. బుధవారం భానుముక్కల, భానకచెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మిమ్ము పంటపై మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హేమలత పాల్గొని మాట్లాడుతూ రైతులు మినుము పంట ప్రతి సంవత్సరం ఒకటే పంట వేసుకోకూడదని పంట మారిపిడిల వల్ల తెగుళ్ళను చీడపీడల నివారించవచ్చును ఆమె తెలిపారు. కాండం తొలిచేపురుగు నివారణకు కార్బోఫ్యురాన్ త్రీజీ కుళికలను ఎకరాకు 10 కేజీల చొప్పున దుక్కిలో వేసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని వాటికి అనుగుణంగా ఎరువులను వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

యువతి పెళ్లికి ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ - బనగానపల్లె : తల్లిదండ్రులు లేని యువతి పెళ్లికి ఆర్థిక సాయాన్ని టీడీపీ యువ నాయకులు శంకేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డిలు అందజేశారు. బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన కీశే ఎక్కులూరి బాలచంద్రుడు, కీశే భారతి దంపతుల ఏకైక పుత్రిక లక్ష్మీకి పాములపాడు మండలం కృష్ణానగర్ గ్రామ వాస్తవ్యులైన వర్రా వెంకటేశ్వర్లు, వర్రా దేవిల దంపతులైన శేఖర్ అనే వరుడుకు పెళ్లి జరుగుతున్నందున బనగానపల్లె మండలం పాతపాడు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు సంగు శంకేశ్వర్ రెడ్డి, మీరపురం టీడీపీ యువ నాయకుడు నారాయణరెడ్డి రూ.21వేలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండిగిరి మేజర్ గ్రామపంచాయతీ పరిధి బైపాస్ సమీపంలో ఉన్న కాలనీలకు నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో డీ1-ఏఈ నాగ భూషన్ ప్రకటన ద్వారా బుధవారం మీడియాకు తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన విద్యుత్ వైర్ల మరమ్మత్తు పనులు జరుగుతున్నందున తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. సంబంధిత విషయం పట్ల విద్యుత్ వినియోగదారులు సంస్థకు సహకరించాలని కోరారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - కోడుమూరు: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈ నెల 7న శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా స్కిల్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ శేఖర్,ప్రిన్సిపల్ విజయ్ తెలిపారు. కోడుమూరు పట్టణ ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాబ్ మేళాలో ఫ్లిప్ కార్ట్, సెల్ ఫోన్ వస్తువుల తయారీ కంపెనీ, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు పాల్గొనుచున్నాయన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, ఎంకామ్ చదువుకున్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఉదయం 10 గంటలకు తమ విద్యార్హత జిరాక్స్ పత్రాలతో కళాశాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలోని విద్యార్థులు ఈ జాబ్ మేళలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 8500783459 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ప్లేస్మెంట్ అధికారి సాయి తేజ,జిల్లా స్కిల్ అధికారి వై వీరేష్ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వేను వేగవంతంగా చేపట్టాలి

విశాలాంధ్ర - తుగ్గలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌సీడీ సర్వేను గ్రామస్థాయిలో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వేగవంతంగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలిపారు. బుధవారం తుగ్గలి, పగిడిరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఎన్‌సీడీ సర్వేను సకాలంలో వేగవంతంగా చేపట్టాలని ఆయన తెలిపారు. ఫార్మాసిస్టు రమేష్, స్టాఫ్ నర్స్ రామలక్ష్మి, డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది సయ్యద్ ఖలీల్ బాష పాల్గొన్నారు.